


# గాలింపు

డా॥ గోపరాజు నారాయణరావు

**"అంటే..... అదేదో బయటికి లాగాలనే మీ యిద్దరూ వచ్చారు!"**

**ఆ స్క్రిబ్లింగ్ ప్యాడ్‌లో ఖాళీగా ఉన్న చివరి కాగితాలు కూడా ఓసారి తిప్పేసి, ఠపీమని మూస్తూ అన్నాడు రాఘవులు. అణుచుకున్న నిరసన, బాధ ఆ గొంతు నిండా.**

కిటికి అని పిలుచుకునే గోడ రంధ్రం దగ్గరగా మొహం పెట్టి సిగరెట్ పొగ వదులుతున్నాడు మస్తాన్‌రెడ్డి. తొలిచేస్తున్న బుర్రకి ఊరటనివ్వడానికి కాబోలు యుద్ధప్రాతిపదిక మీద బూడిద చేస్తున్నాడు దాన్ని. ఆ మాటలోని పెళుసుతనానికి చటుక్కున ఇటు తిరిగి రాఘవులు కేసి చూశాడు మస్తాన్‌రెడ్డి .

కిటికీకి అడ్డు తొలగిపోవడంతో ఆ గదిలో ఒక్కసారి రెట్టింపయింది వెలుతురు. గోడలోకి దింపిన నాలుగు వెదురుబద్దలతో దాదాపు చాట ఆకృతిలో ఉన్న గాలీవెలుతురుల మార్గం. సాయంత్రం నాలుగ్గంటల ప్రాంతం.

ఇటు తిరగ్గానే ప్యాడ్ మస్తాన్‌రెడ్డి చేతిలో పెట్టి – ఒకింత నిరసనగానే– విసురుగా బయటకు వెళ్ళిపోయాడు రాఘవులు.

అది పట్టించుకోలేదు మస్తాన్‌రెడ్డి. కాని, గుబులుగా మంచం వైపు చూశాడు – ఈ అలికిడికి ప్రసన్నకి మెలకువ వచ్చేసిందేమోనని.

ఒక పక్కగా ఉన్న నులకమంచం మీద ఒళ్ళెరక్కుండా నిద్రపోతున్నాడు ప్రసన్న. నిండుగా కప్పేసి ఉంది నల్లటి గొంగడి. సన్నటి గురక వినిపిస్తోనే ఉంది.

జర్నలిస్టులు వాడే తెల్లకాగితాల ప్యాడ్. హైదరాబాద్ నుంచి ప్రసన్న తెచ్చిందే. యాభయ్‌దాకా ఉంటాయి –ఖరీదైన మిల్క్‌వైట్ పేజీలు. కాస్త నలిగినట్టుంది.

చారల చారల ప్లాస్టిక్ కోటెడ్‌పై అట్ట తెరవగానే ముచ్చటగా నోట్స్. కొన్ని పేజీల వరకూ బాపూ స్టయిలు అక్షరాలతో దట్టమైన వాక్యాలు. వాటికి మధ్య, మధ్య హంసపాదులు. అంగుళం పైగా విడిచిపెట్టిన మార్జిన్‌లో రూపాయి బిళ్ళలంత సున్నాలలో ఇరికించి రాసుకున్న అదనపు సమాచారం.

పేజీలు శబ్దించకుండా తిప్పుతున్నాడు మస్తాన్‌రెడ్డి. వరసగా ఎనిమిది తొమ్మిది పేజీలంతా సినాప్సిస్– ఖాళీ లేకుండా.

అవి చూసేసరికే లీలగా అర్థమయింది మస్తాన్‌రెడ్డికి.

తరువాతి పేజీలో పైన రెండు వరసల్లో కనిపించిందా శీర్షిక– కాస్త పెద్ద అక్షరాలతో, మొద్దుపాటి అండర్‌లైన్‌తోనూ.

అది చదవగానే పూర్తిగా అర్థమయింది మస్తాన్‌రెడ్డికి. రాఘవులు క్షోభకీ, దానితో ముడిపడిన ఈ గొలుసుకట్టు సంగతులకి మూలమూ దొరికింది.

'ఇదిగో, రాఘవులూ,....' మస్తాన్‌రెడ్డి గొంతు చివరిదాకా వచ్చిందా కేక. కానీ, ప్రసన్న స్థితి చటుక్కున గుర్తొచ్చి అక్కడే అణిగిపోయింది.

ఒక్క అంగలో గది బయటకొచ్చి చూశాడు మస్తాన్‌రెడ్డి. కనిపించలేదు రాఘవులు. ఆట్టే ఎత్తులేని ఆ అరుగు మీద నుంచి గెంతి, పదడుగులు ముందుకు పోయి కూడా చూశాడు.

ఎగసిన సునామీ కెరటాన్ని మరిపిస్తున్నాయి పచ్చటి కొండలలో ఎత్తుపల్లాలు. మస్తాన్‌రెడ్డి పాదాలకి ఒకింత అవతల నుంచి మొదలైన ఆ ఆకుపచ్చ కెరటం అక్కడెక్కడో నీలాకాశాన్ని తడుముతోంది. ఈ మధ్యలో వాలుగా, నిటారుగా, గుబురుగా చెట్లు. అక్కడక్కడ పోడు సాగు చెక్కలు. ఆ చెక్కలని ఆనుకునే తాటాకు గొడుగులు పరిచినట్టుంది ఇంకో తండా. నది పాయల్లా ఎక్కడో మొదలైన ఆ రెండు సన్నటి కాలిబాటలు దూరంగా ఉన్న ఆ తండా వైపొకటి సాగితే, ఇంకొకటి ఈ తండా ముందుకొచ్చి ఆగుతోంది.

కాస్త ఎత్తుగా ఉన్న ప్రదేశంలో కట్టుకున్న తాటాకుల ఇల్లు అది. ఆ పక్కకి.

ఈ పక్కకి వంగి వంగి చూశాడు మస్తాన్‌రెడ్డి. లేడు రాఘవులు. సిగరెట్ నుసి కూడా రాల్చడం మరిచి పోయి ఇంకోసారి ఇంటి ముందే తచ్చాడాడు.

వెలిసిపోయిన గళ్ళ లుంగీ మీద గంధం రంగు లాల్చీ వేసుకుని ఉన్నాడు మస్తాన్‌రెడ్డి. పొడుగ్గా బక్కపలచగా ఉంటాడాయన. కళ్ళు గుంటల్లా లోతుకి ఉంటాయి. అందుకే కాబోలు అసలే ఎత్తుగా ఉండే దవడ ఎముక, బుగ్గలు మరీ ఎత్తుగా కనిపిస్తాయి. బట్టతల వల్ల నుదురు ముందుకు పొడుచుకు వచ్చినట్టు ఉంటుంది. మనిషి బాగా నలుపు. దానివల్లే కొద్దిగానే మాసినా మరీ దట్టంగా కనిపిస్తోంది నెరిసిన గడ్డం.

మొహం నిండా అసహనం అలుముకుంది. పెద్దగా నిట్టూరుస్తూ ఒకచోట నిలబడిపోయి ఎదురుగా చూశాడు మస్తాన్‌రెడ్డి.

కొంచెం దిగువనే గుంపుగా ఉన్న ఆ పాకలలో ఒక దాని అరుగు మీద గొంతుక్కూర్చుని ఎండకాగుతున్న ఆ వృద్ధురాలు, నుదుటికి చేయి అడ్డం పెట్టుకుని అదేపనిగా చూస్తోంది, బోసినోరెళ్ళబెట్టి - ఇంటి ముందు కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న మస్తాన్‌రెడ్డిని.

ఆ పాకల ముందున్న ఖాళీ జాగాలో అప్పటి దాకా ఆడుకున్న ఆ ఐదారుగురు పిల్లలు కూడా ఆటని, కేరింతలనీ ఆపేసి కళ్ళార్పకుండా మస్తాన్‌రెడ్డినే చూస్తున్నారు. ఏ మూల నుంచో వీస్తోంది కొండగాలి. పిల్లలు రేపిన దుమ్ము గాలికి గిరికీలు కొడుతున్న దృశ్యం సాయంకాలపు ఎండలో కనిపిస్తోంది. చేతిలో కర్రలతో, రకరకాల భంగిమలలో అలాగే నిలబడిపోయారు వాళ్ళు. అందరికీ గుండే. పిల్లలందరి నీడలు ఆ ఖాళీ జాగా నిండా బారెడు బారెడు సాగిపోయి కనిపిస్తున్నాయి- ఏదో ఆర్ట్ సినిమాలో లాంగ్‌షాట్‌లా ఉంది. ఆ ముసలమ్మ ఒంటి మీదే కాదు, ఈ పిల్లల ఒంటి మీద కూడా అవే గుడ్డలు-పచ్చి తేగతోలు రంగువి. మరో సందర్భంలో ఆ గుడ్డలని చూస్తే మస్తాన్‌రెడ్డి ఆలోచన కళింగయుద్ధం వరకూ వెళ్లిపోయేది.

ఆ నిమిషంలో కొంచెం తత్తరపడ్డాడు మస్తాన్‌రెడ్డి.

గబగబా వెనక్కి వచ్చేసి ఆ గది ఎదురుగానే అరుగు మీద చతికిలపడ్డాడు, ప్యాడ్ పక్కన పెట్టి.

ఆఖరి దమ్ము లాగి సిగరెట్టు పీక అవతల పడేస్తూ అనుకున్నాడు, 'ప్రసన్నని తీసుకొచ్చి పొరపాటు చేశానేమో'నని.

తండాలోకి రావడంతోనే జీలుగకల్లు, మడ్డికల్లు అంటూ రాఘవుల కనుబొమలు ముడిపడేలా చేసేశాడు ప్రసన్న. అక్కడెక్కడో తాటితోపులో ఒళ్ళంతా దెబ్బలతో పడిపోయి వుంటే మస్తాన్‌రెడ్డి, రాఘవులు వెళ్ళి మోసుకొచ్చారు మధ్యాహ్నం. డాక్టరే కాబట్టి గబగబా ఏదో ఇంజక్షన్ చేశాడు రాఘవులు. దాంతో మూలుగు ఆపి పడుకున్నాడు.

వింత మనస్తత్వం ప్రసన్నది. ఎంత గట్టిగా ఆలోచించగలడో, అంత అసంబద్ధంగానూ ప్రవర్తించగలడు. లేకపోతే అరకులోయికి ఇంకా పాతిక మైళ్ళు లోపలికి ఉండే ఈ కొండలలో ఇన్వెస్టిగేషన్ ఏమిటి? ఇంక తాగుడంటే ఇంత మంచి జర్నలిస్టూ శాయిలం దగ్గరి చంటిపిల్లాడైపోతాడు. ఇద్దరూ పరిచయమైన మూడోరోజున మందుపార్టీ అడిగేశాడు....ప్రసన్న చీఫ్ సబ్ ఎడిటర్. తానేమో లీగల్ కరస్పాండెంట్. కాని ప్రసన్నకి బొత్తిగా మొహమాటాలేం లేవు.

''హలో సార్! నిన్న కూంబింగ్ వార్తకి హెడ్డింగ్ మీరే పెట్టార్ట కదా! చాలా బావుంది సార్! అది నేనే రిపోర్ట్ చేశా. సిటీ నుంచి రేపు ఫ్యాక్ట్‌ఫైండింగ్ కమిటీ వెళుతోంది ....'' అన్నాడారోజున ప్రసన్న సీటు దగ్గరకు వెళ్ళి, మస్తాన్‌రెడ్డి.

''కాస్త నిజనిర్ధారణ సంఘం అనకూడదూ! పాపం మనది తెలుగు పత్రిక...'' మధ్యలోనే అన్నాడు ప్రసన్న, ఏదో రాసుకుంటూనే.

''మన్నించాలి! అదే! హక్కుల సంఘం తరపున నేనూ వెళుతున్నాను. వచ్చాక కలుస్తాను. అంత మంచి హెడ్డింగ్ పెట్టినందుకు మరోసారి అభినంద

''హక్కుల వారు కూడా మంత్రుల్లా మాట్లాడితే అస్సలు బావుండదు! చర్చల గొడవ చెన్నారెడ్డి కాలం నుంచి చంద్రబాబుదాకా ఉంది. జరిగాయా! రాజశేఖరరెడ్డి పాద యాత్ర గుప్పించిన చర్చల హామీ, తర్వాత మేనిఫెస్టోలో కొచ్చింది! మన ఎన్నికల హామీలకి ఉండే విలువ, ప్రామాణికత ఏపాటిదో తెలుసుకదా! అయినా చర్చలకి మంజీరా అతిథిగృహానికి వచ్చేశారు అన్నలు'' అన్నాడు ప్రసన్న నవ్వేస్తూ.

నలు సార్!'' చెప్పాడు మస్తాన్‌రెడ్డి.

''అదిరిందంటారా!'' చాలా మామూలుగా అన్నాడు ప్రసన్న.

''ఊరికే చెప్పడం లేదు సార్! డిస్‌ప్లే కూడా బాగా వచ్చింది. ఆఫీసులో మీకు నాలాంటి ఏకలవ్య శిష్యులు ఇంకా ఉన్నారు సార్! మీరు రాసినట్టు వార్త రాయాలని, లీడ్ రాయాలని, హెడ్డింగ్ పెట్టాలని ......'' వినయంగా అన్నాడు మస్తాన్‌రెడ్డి.

''అలాంటి ఒట్టిమాటలు నాకు నచ్చవ్ రెడ్డి గారూ! మీలోని ఏకలవ్యుని నిరూపించుకోవాలంటే..... మీ థమ్ వద్దు కానీ, ఓ ఆఫ్ రమ్ సమర్పించుకోండి చాలు. ఇలాంటి వాటికి చిన్నదో, పెద్దదో శాంతి జరగాలండీ!'' నవ్వుతూనే అనేశాడు ప్రసన్న.

కంగారుపడిపోయాడు మస్తాన్‌రెడ్డి. ఇదేమిటి మొన్న పరిచయం అయితే ఇవాళే శాంతి, తీర్థం అంటాడేమిటి అనుకుంటూనే, '' సిట్టింగుకేంలెండి సార్ అలాగే వేద్దాం!'' అన్నాడప్పుడు. మస్తాన్‌రెడ్డికి జర్నలిజం హాబీ. వృత్తికి లాయరైనా, పేరు మాత్రం హక్కుల కార్యకర్తగానే.

గతరాత్రి నుంచి జరుగుతున్న గడబిడ, రాఘవులు పడుతున్న సంకటం చూస్తుంటే ఆర్గనైజేషన్ నుంచి మాట తప్పదేమోననిపిస్తోంది. కాని, దీని కంతటికీ తన అండ ఉందని రాఘవులు అపోహ పడడమే మస్తాన్‌రెడ్డికి మరీ మనస్తాపం కలిగిస్తున్నది. పైగా తను ఎందుకు వస్తున్నాడో ఆర్గనైజేషన్ రాఘవులకి ముందే తెలియచేసింది కూడా.

ఇన్ని గంటలు అంత క్లోజ్‌గా ఉన్నా, అన్ని మాటలు చెప్పుకున్నా మాటమాత్రంగా అయినా ప్రసన్న తన మనసులో ఉద్దేశం చెప్పకపోవడం మరీ బాధగా ఉంది. అవతలి మొన్న హైదరాబాద్‌లో గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కారిద్దరూ. రిజర్వేషన్ ఉన్నా పడుకోలేదు. అరకులో రాఘవులు వచ్చి రిసీవ్ చేసుకునే దాకా ఎన్ని విషయాలు మాట్లాడాడని!

''చూడండి మస్తాన్‌రెడ్డిగారూ! పార్లమెంటరీ రాజకీయాలు, విప్లవ పార్టీలూ చర్చలు జరపడమంటే ఓ పెద్ద జోక్ కాదూ!'' అన్నాడు ప్రసన్న చీకట్లో దాటిపోతున్న ఏదో స్టేషన్ పేరు చదవడానికి ప్రయత్నిస్తూ.

''రాష్ట్రంలో శాంతికోసం ఈ చర్చలు జరగాలని ప్రజలు కోరుతున్నారు!'' అన్నాడు మస్తాన్‌రెడ్డి.

''హక్కుల వారు కూడా మంత్రుల్లా మాట్లాడితే అస్సలు బావుండదు! చర్చల గొడవ చెన్నారెడ్డి కాలం నుంచి చంద్రబాబుదాకా ఉంది. జరిగాయా! రాజశేఖరరెడ్డి పాదయాత్ర గుప్పించిన చర్చల హామీ, తర్వాత మేనిఫెస్టోలో కొచ్చింది! మన ఎన్నికల హామీలకి ఉండే విలువ, ప్రామాణికత ఏపాటిదో తెలుసుకదా! అయినా చర్చలకి మంజీరా అతిథిగృహానికి వచ్చేశారు అన్నలు'' అన్నాడు ప్రసన్న నవ్వేస్తూ.

''చర్చలు తప్పంటారా?''

''అనునుగానీ, చర్చల పేరుతో వార్, జనశక్తి లాంటి పార్టీలూ, కాంగ్రెస్ ఒకే నాటకంలో పాత్రధారులయ్యారన్న విమర్శ గురించే నా బాధ. ఉచిత విద్యుత్ అంటూ తొలి ఫైలు మీద సంతకం చేసి, తరవాత దానిని వైఎస్‌గారు ఎగేసినా రైతు అడగలేడు. కానీ, నక్సలైట్లతో అది కుదరదు. వాళ్ళ దగ్గర తుపాకీ ఉంది. అందుకు భయపడి చర్చలన్నారు. ఈ సందులో కేడర్‌ని బలపరుచుకోవడం అన్నయ్యల ధ్యేయం'' అన్నాడు ప్రసన్న.

''విప్లవపార్టీలు చర్చలకొచ్చినా అది ఎత్తుగడలో భాగమేనని వాళ్ళే అన్నారుగా!''

''ఆ, అదే మస్తాన్‌రెడ్డి గారూ! అదే నేనూ అనేది. అంతిమంగా తేలేది ఇందులో ప్రజల ఆశలూ, ఆకాంక్షల ప్రమేయం అట్టే లేదనే, అటు పార్లమెంటుకి, ఇటు విప్లవానికి....''

స్త్రీవాద కవిత్వం,దళిత సాహిత్యం, ముస్లిం వాదం, ప్రపంచీకరణ, సెప్టెంబర్ 9, వాజపేయి పాలన, నిన్నటి కమ్యూనిస్టు దేశాలు ఇవాళ అమెరికా కూటమిలో చేరడానికి క్యూలు కట్టడం, చైనాలో ప్రైవేటు పెట్టుబడులు.... తెల్లవార్లూ మాట్లాడుకున్నారు ఇద్దరూ.

'నిజమే! ప్రసన్నని వెంటబెట్టుకు రావడం తప్పిదమే' మళ్ళీ అనుకున్నాడు మస్తాన్‌రెడ్డి. సిటీల్లోను, టౌన్లలోను ఆఫీసర్లని, పార్టీల నాయకులని మభ్యపెట్టి లేదా కార్డు చూపించి బెదిరించినట్టు, లాలించి

నట్టు గిరిజనులని కూడా లొంగదీసుకోవచ్చునను కున్నాడులా ఉంది ప్రసన్న. 'అయినా తన తప్పూ ఉంది' అనుకున్నాడు మస్తాన్‌రెడ్డి. ఆరోజు నోరు జారకుండా ఉంటే ఇంతవరకూ వచ్చేది కాదు.....

ప్రెస్‌క్లబ్‌లో రెండో రౌండ్‌లో మొదలైంది కూంబింగుల మీద, రక్షకదళాల అత్యాచారాల మీద చర్చ. చాలా ఆవేశంగా మాట్లాడాడు ప్రసన్న.

దాంతో మస్తాన్‌రెడ్డి సర్వం మరచి రెండే ముక్కలు నోరు జారాడు – 'ఎక్కడిదాకానో ఎందుకు సార్? మన కరాయిగూడలో....' అంటూ.

కాని, రాఘవులకిచ్చిన ప్రమాణం లాంటి మాట మస్తాన్‌రెడ్డి నోరు నొక్కింది.

అప్పటినుంచి ప్రసన్న వెంటపడుతూనే ఉన్నాడు – అసలు సంగతేమిటో చెప్పమని.

అది ఆర్గనైజేషన్ వ్యవహారమని, తనని ఇబ్బంది పెట్టవద్దని చెప్పాల్సి వచ్చింది. పోనీ ఒక్కసారి విశాఖ మన్యం చూపించమని అడిగాడు ప్రసన్న. దాని పర్యవసానమే ఈ ప్రయాణం.

ఇంతలోనే మణిపూర్ ఘటనలు దేశాన్ని కుదిపేశాయి. 'సెవెన్ సిస్టర్స్' మానభంగాలకు నిరసనగా మహిళల నగ్న ప్రదర్శన .....

ప్యాడ్‌లో అండర్‌లైన్ చేసిన ఆ హెడ్డింగ్ చటుక్కున మెదిలింది మస్తాన్‌రెడ్డి మదిలో. చేతులోకి తీసుకుని ఆ పేజీలోకి వెళ్ళాడు. చూడబోతే వార్తా కథనంలా ఉంది.

ముదురు నీలం సిరా అక్షరాలు సాయంత్రపు ఎండలో మెరుస్తున్నాయి. 'చక్కగా రాస్తాడు ప్రసన్న!' అనుకోకుండా ఉండలేకపోయాడు మస్తాన్‌రెడ్డి. చదవడం మొదలుపెట్టాడు–

'మన్యం నుంచి మణిపూర్ దాకా...'

.......

కొండలలో ఇప్పుడు కొంగలబారులు కానరావు. ఆ లోయలలో లేళ్ళ గుంపులూ కనిపించవు. ఆకుల చాటున కొమ్మల మీద పాకే గండు చీమల్లా ఎక్కడ చూసినా బారులు తీరుతున్న సాయుధబలగాలు. ఇక్కడ ఆంధ్రప్రదేశ్ మొదలు అలా ఒరిస్సా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, బీహార్, జార్ఖండ్... ఇంకొంచెం ముందుకు వెళితే ఈశాన్యభారతంలో అస్సాం, త్రిపుర, నాగాలాండ్, మిజోరాం, మణిపూర్... ఏ కొండా, ఏ లోయా చూసినా బారులు బారులుగా యూనిఫారాల కదలికలు. ఒకచోట నక్సల్స్ కోసం వేట, కూంబింగ్. ఇంకోచోట వేర్పాటువాదుల ఏరివేత. ఉల్ఫాలు, బోడోలు, నాగావిద్రోహులు, మణిపూర్ పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్ సాయుధ బలగాల మధ్య అక్షరాలా సమరం. నిషేధాజ్ఞలు, లైంగిక అత్యాచారాలు, ఎన్‌కౌంటర్లు, థర్డ్ డిగ్రీ – ఇదే పచ్చని కొండల మీది వాస్తవచిత్రం.

నిజమే! ఉగ్రవాదమో లేదా వేర్పాటువాదమో– అది పేల్చే ప్రతి తూటా ప్రజారాజ్యాన్ని స్థాపించేదేనని అనలేం. కాని అడవులలోను, కొండలలోను శాంతిస్థాపన పేరిట ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యా అణచివేతకి, హక్కుల ఉల్లంఘనకి, రాజ్యహింసకి తిరుగులేని ఉదాహరణేనని కచ్చితంగా చెప్పగలం. ఎక్కడ దళాలు మోహరిస్తాయో, అక్కడ అత్యాచారాలు వెల్లివిరుస్తాయి.

పోలీసులు, బిఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్, అస్సాం రైఫిల్స్ ఎవరైనా కావచ్చు, ఆఖరికి సైనికదళాలే కావచ్చు. అందరూ 'కల్లోలిత ప్రాంతం'లో సాధారణ పరిస్థితులు 'నెలకొల్పే' అధికారంతో పాటు సర్కారువారు తమకి అక్కడి మహిళల శరీరాల మీదా సంపూర్ణ హక్కులేవో సంక్రమింప చేసినట్టే వ్యవహరించడం అతిపెద్ద సామాజిక విషాదం. ఏ దేశంలో, ఏ కాలంలో అయినా సాయుధదళాలలో ఇదే విశ్వాసం టన్నుల కొద్దీ కనిపిస్తుంది. విశాఖ కొండలలో ఇరవై దశకంలో జరిగిన రంప ఉద్యమం నుంచి నిన్నటి పల్నాడు కూంబింగ్ సంఘటన వరకు ఇదే పునరావృతమయింది. రేపూ అవుతుంది.

మన పలనాడులో రెండేళ్ళక్రితం ఓ అర్ధరాత్రి నక్సల్స్ కూంబింగ్ పేరుతో పోలీసులు బటుకుల

రేప్, ఆపై హత్య... మణిపూర్ మండిపోయింది. ఒక సమూహం దశాబ్దాలుగా అనుభవిస్తున్న క్షోభకు పరాకాష్టగా ఇంపాల్‌లో అస్సాం రైఫిల్స్ తిష్ట వేసిన కాంగ్లా ఫోర్టు ముందు పది పన్నెండు మంది మహిళలు– అమ్మల వయసున్న వాళ్ళు – పూర్తి నగ్న ప్రదర్శన జరిపారు.

పాయ తండాని చుట్టుముట్టారు. అంజమ్మ, మంగమ్మ, ఈదమ్మ అనే ముగ్గురు మహిళలపైన కొందరు పోలీసులు సామూహిక మానభంగానికి పాల్పడ్డారు. బాగా గగ్గోలైతే హైదరాబాద్‌లో మానవహక్కుల కమిషన్ విచారణ జరిపింది. పోలీసులని పరేడ్ చేయించారు. పోలీస్ క్యాంప్‌కే శీల పరీక్ష. ఆ ముగ్గురు ఆడవాళ్ళు ఆరుగురు కానిస్టేబుళ్ళని గుర్తించారు. నల్లమలలో సిద్దాపురం ఎస్ ఎన్ తండాని పోలీసులు ఆత్మకూరు స్టేషన్‌లో పెట్టారు. ఆ సంవత్సరం పోలీస్ కస్టడీలో చనిపోయిన వారి సంఖ్య పదమూడు వందల యాభయ్ అన్న సంగతి వాళ్ళకి తెలియదు కానీ, లాకప్‌కి వెళ్ళిన వాడు తిరిగివస్తాడో రాడోనన్న బెంగతో తండా మహిళలు స్టేషన్‌ని ముట్టడించారు. సాయుధ బలగాల మదం తెలుగునాట స్త్రీలే కాదు, పశువులు కూడా చవి చూశాయి. హయగ్రీవాచారిని నక్సలైట్లు చంపేసినపుడు తెలంగాణ మరోసారి సాయుధ బలగాలతో నిండిపోయింది. ఒళ్ళు వేడెక్కిన ఓ క్షణాన ఏ అబలా చేతికి చిక్కని ఒక మదపు రక్షకభటుడు ఎదురుగా కనిపించిన పెయ్యిదూడని మానభంగం చేశాడు. గోవత్సం మీద జరిగిన ఈ ఘోరం గురించి అప్పుడు పేపర్లన్నీ ప్రచురించాయి కూడా.

నట్టడవులే కాదు, నగరాలూ ఇలాగే అఘోరించాయి. హైదరాబాద్‌లోని సైదాబాద్‌లోను, కుల్సుంపురాలోను ఇలాంటి ఘోరాలే జరిగాయి. సైదాబాద్‌లో ఇద్దరు ఆడవాళ్ళని ఐదుగురు పోలీసులు రేప్ చేశారు. తరువాత వాళ్ళ దగ్గర డబ్బులు కూడా ఊడలాక్కున్నారు. ఇంతకీ ఆ ఇద్దరూ సెక్స్‌వర్కర్లు. కుల్సుంపురాలో ఒక మహిళని నలుగురు పోలీసులు రేప్ చేశారు. ఢిల్లీలో విదేశీ రాయబార కార్యాలయం ఉద్యోగినిని అవారా గాళ్ళు రేప్ చేస్తే, సాక్షాత్తు రాష్ట్రపతి అంగరక్షకులు నలుగురు ఢిల్లీ యూనివర్శిటీ అమ్మాయిని రేప్ చేశారు. ఇవన్నీ వెలుగు చూశాయి.

మరి చీకటి మాటున ఉండిపోయిన వాటి మాటో!

కాని, ఒక సమాజం ఇంకా చెప్పాలంటే ఒక దేశమే ఇంక తలెత్తుకు తిరిగే అర్హత కోల్పోయిందని చెప్పగలిగే ఉదంతం మన పుణ్యభూమిలోనే మణిపూర్‌లో జరిగింది. ఈశాన్య భారతం నుంచి వచ్చే 'నాగాలాండ్ పేజ్' దిన పత్రిక దాని మీద ఇచ్చిన నివేదికనే కొన్ని మార్పులతో ఇస్తున్నాం.

**మణిపూర్ తల్లుల నగ్న ప్రదర్శన .......**

ఇంఫాల్, జూలై 15: సెవెన్ సిస్టర్స్ వస్త్రాపహరణ దృశ్యం ఢిల్లీ ప్రభువులకు కనిపించిందా! ఇక్కడ జీవించే హక్కు భద్రతాదళాల తుపాకీ బాయ్‌నెట్ల మీద కొన్ని దశాబ్దాలుగా కొట్టుమిట్టాడుతోంది. వారి ప్రత్యేకాధికారాల చట్టం ఏడు ఈశాన్య రాష్ట్రాలను (సెవెన్ సిస్టర్స్) చెరపట్టింది. ఈ చట్టం కాస్త సడలిస్తే మణిపూర్ ఉగ్రవాదుల స్వర్గం అవుతుందని ఢిల్లీ పెద్దల ఉవాచ. కాని, హింసకు పాల్పడుతున్న ఉగ్రవాదులను శిక్షించకూడదని ఇక్కడి సాధారణ ప్రజలు అనడం లేదే! వారు కోరేది– జీవించే హక్కు. వారు ప్రశ్నిస్తున్నది– భర్తల ఎదుట భార్యల శరీరాలని, కుటుంబ సభ్యులందరి ముందు తల్లీకూతుళ్ళ అంగాలను యథేచ్ఛగా 'సోదా' చేసే రక్షకదళాల పైశాచికానందం గురించి. తంగజమ్ మనోరమ ముప్పయ్ రెండేళ్ళ మాజీ వేర్పాటువాది. ఆమెను అస్సాం రైఫిల్స్ పోలీసులు ఇంటి దగ్గర లొంగకపోతే క్యాంప్‌కి తీసుకుపోయారు. తరువాత ఒళ్ళంతా తూటాల గాయాలతో ఆమె శవం కనిపించింది. రేప్, ఆపై హత్య... మణిపూర్ మండిపోయింది. ఒక సమూహం దశాబ్దాలుగా అనుభవిస్తున్న క్షోభకు పరాకాష్టగా ఇంపాల్‌లో అస్సాం రైఫిల్స్ తిష్ట వేసిన కాంగ్లా ఫోర్టు ముందు పది పన్నెండు మంది మహిళలు– అమ్మల వయసున్న వాళ్ళు – పూర్తి నగ్న ప్రదర్శన జరిపారు. 'మీ తల్లుల వయసు వాళ్ళం. అయితేనేం! ఆడవాళ్ళమే. కాబట్టి మమ్మల్నీ రేప్ చేయం'డంటూ సంప్రదాయ వైష్ణవ కుటుంబాలకు చెందిన ఆ ఆడవాళ్ళంతా డగ్గుత్తికతో బీభత్సంగా ఆహ్వానించడం ఆరువందల ఏళ్ళ ఆ చరిత్రాత్మక కాంగ్లాఫోర్టు ఏ శతాబ్దంలోను చూసి ఉండదు. ఆ స్త్రీలు సజల నయనాలతో, ఆక్రోశంతో రాజ్‌భవన్‌కు ఊరేగింపు తీశారు , పట్టపగలు దిశమొలలతో. ఆ మణిపూర్ మనోరమలా మరణించక పోయినా పోలీసుల అత్యాచారానికి గురై జీవ

చ్ఛవంలా బతుకుతున్న ఒక మహిళ విశాఖ మన్యం లోనూ కనిపిస్తుంది...

..................

"మన్నించాలి, ఇందాక కొంచెం ఎమోషనల్ అయ్యాను. రండి లోపలికి వెళదాం!"

అప్పుడే వచ్చిన రాఘవులు అరుగు మీదే చలి గాలిలో కూర్చుని ఉండిపోయిన మస్తాన్‌రెడ్డి భుజం మీద చేయి వేసి అనునయంగా అన్నాడు.

చీకటి చిక్కపడింది. ఎనిమిదై ఉండాలి. కీచు రాళ్ళ రొద.

రాఘవులు భుజం మీద చేయవేయడంతో ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు మస్తాన్‌రెడ్డి. ముందు లోపలికే చూశాడు. చిమ్మ చీకటి. చుట్టూ గుడిసె లన్నీ సద్దుమణిగిపోయాయి. జేబులో నుంచి అగ్గి పెట్టె తీసి పుల్ల వెలిగించాడు మస్తాన్‌రెడ్డి. ఆ వెలుగులోనే లోపలికి వెళ్ళారిద్దరూ.

గబగబా లాంతరు వెలిగించాడు రాఘవులు. తరువాత ప్రసన్న నుదుటి మీద చేయి వేసి చూశాడు. చేతిలో ప్యాడ్ ప్రసన్న తల దగ్గరే పడేసి తానూ నుదుటి మీద చేయి వేసి చూశాడు మస్తాన్‌రెడ్డి. మామూలుగా ఉంది.

"కాస్సేపట్లో లేస్తాల్లెండి!" అంటూనే వంట ప్రయత్నం ప్రారంభించాడు రాఘవులు. చితుకుల మధ్య ఏదో పీచు పెట్టి పొగగొట్టంతో ఊది ఊది వెలిగించాడు పొయ్యి. పావుగంట పట్టింది. లాంతరు గుడ్డి వెలుతురులో రాఘవులు అలవోకగా చేస్తున్నాడు పనులు. అతడు బియ్యం ఎసట్లో పోస్తుంటే అన్నాడు మస్తాన్‌రెడ్డి.

"క్షమాపణ చెప్పాల్సింది నేనే రాఘవులు. ప్రసన్నని నేను సరిగా అర్థం చేసుకోలేదనే అనిపిస్తోంది. అయితే ఇతను ప్రమాదకారి మాత్రం కాదు. ప్రజా ఉద్యమాలంటే ప్రెస్ అంటరానివిగా చూస్తున్న ప్రస్తుతకాలంలో అతడు వాటికి చోటు కల్పించడానికి పోరాడుతున్నాడని గట్టిగా చెప్పగలను. ఇంక ఇదంతా ఏమిటీ అంటావా? సంచలనాలు అతడి వృత్తి అంటించిన జాడ్యం" అంటూ కొన్ని ఉదాహరణలు కూడా చెప్పాడు.

"అర్థం చేసుకోగలను! కాని, ఇక్కడి గిరిజనులతో నాకుండే సంబంధం, నామీద వాళ్ళకి ఉన్న నమ్మకం ఇవన్నీ చూసి నేను కొంచెం కంగారు పడ్డాను" అన్నాడు రాఘవులు.

కొద్దిసేపటికి లేచాడు ప్రసన్న.

మంచినీళ్ళ బాటిల్ అందిస్తూ అడిగాడు మస్తాన్‌రెడ్డి " ఎలావుంది!"

"ఫర్లేదు. తల కొంచెం నాదుగా ఉందంతే." సిగ్గుపడుతూ అన్నాడు ప్రసన్న. మొహాలు చూడ్డానికి బిడియపడుతున్నాడని అర్థమవుతోంది. చెమటోడుతున్న బనీను, ప్యాంటు మార్చుకోమన్నా పట్టించుకోకుండా అలాగే మంచం మీద కూర్చుకున్నాడు.

మస్తాన్‌రెడ్డితో కూడా ఏమీ చెప్పకుండా మధ్యాహ్నం అలా వెళ్ళొస్తానని చెప్పి తాను బయటపడడం, తర్వాత నిర్వాకం గుర్తుకొస్తున్నాయి. ఆ గుడిసెల దగ్గరికి వెళ్ళాడు. ఒకదాని తలుపు తడితే ఒక ముసలమ్మ తీసింది. ఆమె పలకరించడానికి బదులు బెదిరిపోయింది. ఏవో కబుర్లు చెప్పి ఆమెతో మాటలైతే కలిపాడు. మంచినీళ్ళు ఇమ్మంటే, శుభ్రంగా తోమిన ఇత్తడి పాత్రతో ఇచ్చింది. అప్పుడే అడిగాడా సంగతి, ఇక్కడ ఆ మధ్య పోలీసులు తండా మీద దాడి చేశారా? అని. పాత్ర సంగతి కూడా పట్టించుకోకుండా ధామ్మని తలుపు మూసిందామె. కొంచెం దూరం నడిచాక ఇద్దరు కుర్రాళ్ళు ఏవో ఆకులు ఏరుతున్నారు. వాళ్ళతో మాటలు కలిపి కూడా అడిగాడు. అక్కడ ఒక మనిషి ఉన్నాడన్న సంగతే తెలియనట్టు వాళ్ళు ఆకులు ఏరుకున్నారు. తరువాత అవి మూటకట్టుకుని వెళ్ళిపోయారు. కాళ్ళు పీకేటట్టు నడిచాడు. తనని ఎవరో వెంబడిస్తున్నారన్న అనుమానం కూడా ఒకసారి వచ్చింది. అది తన భ్రమే అనుకున్నాడు. అదేమిటో తరువాత మాటలు వినిపించేవి అక్కడికి వెళితే మనుషులు కనిపించేవారు కాదు. నడవగా నడవగా దూరంగా పోడు పొలంలో పని చేస్తున్న కొందరు 'గిరిజనులు కనిపించారు. వాళ్ళతో మాట కలిపాడు ప్రసన్న. కరాయిగూడ తండాలో పోలీసులు రేప్ సంగతి చెబుతారా? అని తాను స్పష్టంగా అడిగేశాడు. వాళ్ళందరి ముఖాలు మారిపోయాయి. తనకు కాస్త సమాచారం ఇస్తే ఆ కీచక పోలీసుల్ని పట్టించి జైల్లో తోయిస్తానని చెప్పాడు. ఒక్కొక్కరే అక్కడ నుంచి వెళ్ళిపోతున్నారు తప్ప ఎవరూ మాట్లాడడం లేదు. ఒక మధ్య వయస్కుడి చేయి పట్టుకుని మళ్ళీ అడిగాడు తాను. అప్పుడే ఎవరో వెనక నుంచి మెడ మీద కొట్టారు. కళ్ళు బైర్లు కమ్మాయి. వెంటనే ముఖం మీద మరో దెబ్బ. చేతిలో ప్యాడ్‌ను ఎవరో గుంజుకోబోయారు. గట్టిగా పట్టుకున్నాడు తాను. తరువాత ముక్కు దగ్గర ఏదో వాసన. మెదడు మొద్దుబారిపోయింది.

"రండి! భోజనం చేద్దాం. కాస్త ఓపిక వస్తుంది."అన్నాడు రాఘవులు ప్రసన్న భుజం మీద చేయి వేసి.

ఉన్నది ముగ్గురే అయినా మాటలు భారంగా దొర్లుతున్నాయి ఆ చిన్న గదిలో. మౌనంగానే అన్నాలు తిన్నారు. మళ్ళీ మంచం మీద వాలాడు ప్రసన్న.

"అనూహ్యం ఏమీ కాదుగానీ, చంద్రబాబుని టార్గెట్ చేసుకున్న తరువాత విప్లవ పార్టీల మీద నిర్బంధం పరాకాష్ఠకి చేరిపోయింది కదా! సరే, ఆదివాసీలు కాపాడుతుంటేనే నక్సలెట్లు బతికిబట్ట కడుతున్నారని పోలీసుల గట్టి నమ్మకం. వీళ్ళు పెట్టే తిండితిని, నీళ్ళుతాగి అన్నలు ఉద్యమిస్తున్నారని ఎనలేని విశ్వాసం.

కొంత సమయం తరువాత తనే అన్నాడు ప్రసన్న- "వెరీ సారీ. మిమ్మల్ని బాగా ఇబ్బంది పెట్టాను. ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ"

"జరిగిందేదో జరిగిందిలెండి. వాళ్ళకి నేనేదో చెప్పుకున్నాను. అంతా మరిచిపోయి ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోండి" అన్నాడు రాఘవులు.

"ఈ సందర్భంగా కాస్త టీ తాగితే బాగుంటుందేమో కదా ప్రసన్నగారూ!" అన్నాడు నవ్వుతూ మస్తాన్‌రెడ్డి.

అడవి పిల్లులు పోరుకు దిగినట్టున్నాయి- కర్ణకఠోరమైన గోల, దూరం నుంచి, రెండు మూడు నిమిషాలు.

గదిలో చెయ్యెత్తితే అందేలా ఉంది ఆ వెదురు వాసం. దానికే వేలాడుతోంది చిన్నసైజు లాంతరు ఒక ఓ అడుగు ఇనప తీగకి. తీగని కదిపి చాలా కాలం అయిండాలి, ఆ తీగకు దట్టంగా పట్టిన బూజు తుమ్మచెట్టు మీద తెల్లగొంగళి పురుగుల తుట్టెలా కనిపిస్తోంది ఆ చిరువెలుగులో. నల్లమట్టి గోడలు, వాటి మీద సున్నం మచ్చలు కూడా చిక్కగా కనిపిస్తున్నాయి. వీధి తలుపు, కిటికీని గోనెగుడ్డతో మూసేసినా గదిలో కాస్త చలిగానే ఉంది. గోనెగుడ్డ గాలికి సన్నగా కదులుతోంది. రాత్రి పన్నెండు దాటి ఉండాలి.

మంచం మీద ఒత్తిగిలి పడుకుని ప్రసన్న కళ్ళు మూసుకునే ఉన్నాడు ప్రసన్న, నిద్ర కాదు, ఏదో మత్తు. అతని తలవైపు మంచం కోడుకు ఆనుకుని మండుతున్న పొయ్యివైపు కాళ్ళు బారజాపుకుని మట్టినేల మీదే కూర్చున్నాడు మస్తాన్‌రెడ్డి. నోట్లో సిగరెట్ వెలుగుతోంది. గదిలో ముందు కట్టెలు కాలిన వాసన, తరువాత టీ డికాషన్ పొంగిన వాసన ప్రసన్న ముక్కును తాకింది.

"అలిపిరిలో చంద్రబాబునాయుడి కాన్వాయ్ కోసం మందుపాతర పేల్చిన రెండు మాసాలకే ఇక్కడ ఆ సంఘటన జరిగింది."

ఆ చిన్న మట్టిపొయ్యి ముందే గొంతుక్కూర్చుని పొంగుతున్న టీ గిన్నెని గుడ్డతో పట్టుకుని ఆ మూడు గ్లాసులలోకి ఒంపుతూ నెమ్మదిగా చిన్న గొంతుతో ప్రారంభించాడు రాఘవులు.

"అనూహ్యం ఏమీ కాదుగానీ, చంద్రబాబుని టార్గెట్ చేసుకున్న తరువాత విప్లవ పార్టీల మీద నిర్బంధం పరాకాష్ఠకి చేరిపోయింది కదా! సరే, ఆదివాసీలు కాపాడుతుంటేనే నక్సలైట్లు బతికిబట్ట కడుతున్నారని పోలీసుల గట్టి నమ్మకం. వీళ్ళు పెట్టే తిండితిని, నీళ్ళుతాగి అన్నలు ఉద్యమిస్తున్నారని ఎనలేని విశ్వాసం. అన్నలు మందుపాతర్లు పేల్చినా వీళ్ళకే సంకటం. పోలీసులు ఎన్‌కౌంటర్లు చేసినా వీళ్ళకే తిప్పలు. ఇక్కడ బాలరాజుని నక్సల్స్ కిడ్నాప్ చేసినా, అక్కడెక్కడో నల్లా ఆదిరెడ్డిని, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డిని ఎన్‌కౌంటర్ చేసినా వీళ్ళ మీదే నిఘా. ఘట్‌కేసర్ దగ్గర ఎలిమినేటి మాధవరెడ్డిని మందుపాతర పెట్టి లేపేసినా ఇక్కడ ఈ తండాల మీదే గురి."

ఆ మాటలకి లేచాడు ప్రసన్న. మస్తాన్‌రెడ్డి పెదవుల మధ్య నుంచి చాలా చనువుగా సిగరెట్ తీసుకుని రెండు దమ్ములు లాగి మళ్ళీ ఇచ్చేశాడు.

పొయ్యిలో ఒకటి రెండు చితుకుల నుంచి పొగ సన్నగా వస్తోంది- పలక మీద గీసిన బలపం రేఖలా.

''కూంబింగ్ పేరుతో పోలీసులు వచ్చి పడ్డారంటే ఏం జరుగుతుందో ఊహించలేం. మనిషి ప్రాణం, ఆడదానిమానం, ఆఖరికి గొర్రె, మేక, కోడి... ఇంత నెయ్యి ముంత- ఏదైనా కోల్పోవచ్చు. అరెస్టులు, స్టేషన్లలో పెట్టడాలు, లంచాలుపడేసి విడిపించుకోడాలు- అంతా కొన్ని నెలల బాగోతం....''

అంచులు పట్టుకుని జాగ్రత్తగా ఒక గ్లాసు ప్రసన్నకి, మరోగ్లాసు మస్తాన్‌రెడ్డికి అందించాడు రాఘవులు.

వేడిగ్లాసు అందుకుంటూ అడిగాడు మస్తాన్ రెడ్డి- ''ఏమాధారం పెట్టుకుని తండాల మీదకొస్తారు?''

''ఏమిటి రెడ్డిగారూ! సోదాకి పోలీసులకి ఆధారం కావాలా ? ఇలా అంటున్నానని ఏం అనుకోవద్దు. హైదరాబాద్‌లో సుందరయ్య పార్కు దగ్గరో, అసెంబ్లీ ముందో హక్కుల గురించి నినాదాలు చేయడమంత సులభం కాదు, ఇక్కడ పోలీసులతో వేగడం. తండాల మీద పోలీసుల దాడి ఎలా ఉంటుందో నేను ప్రత్యక్షంగా చూశాను. ఎక్కడో తుపాకీ పేలుతుంది. జీపుల హోరు వినిపిస్తుంది. గుండెలు అవిసిపోతాయి. ఇక తండా మీద పడితే అంతే. చావాలనిపిస్తుంది. అంత అవమానిస్తారు. ఆ సంఘటనా అంతే!''

పొయ్యికి ఇవతల, ఆ ఇద్దరికి ఎదురుగా గోడకి జారపడి కూర్చుని, మూడో టీ గ్లాసు అందుకున్నాడు రాఘవులు. ముగ్గురూ ఊదుకుంటూ తాగే ప్రయత్నంలో ఉన్నారు.

'క్లా....ర్క్‌ర్క్......ర్క్......' దూరంగా ఏదో పక్షి అరుపు. కొండలన్నీ ఒక్కసారి ప్రతిధ్వనించాయి, భయంగొలిపేలా.

కొన్ని నిమిషాలు మౌనం.

''ప్రసన్న గారూ! నాకు తెలిసిందీ, నేను చూసిందీ చెబుతున్నాను.దానిని పేపర్లకి ఎక్కించాలా వద్దా అనేది మీరే నిర్ణయించండి! మీ విచక్షణ మీద నాకు నమ్మకం ఉంది.''

ఈ సమష్టి దాపరికంలోని హేతువును వివరించడం ఇక ఈ క్షణపు అవసరం అన్న రీతిలో విషయాన్ని విప్పడానికి ఉద్యుక్తుడయ్యాడు రాఘవులు. కాని, ఇప్పటికీ అతని గొంతులో ఒక అనిష్టత.

ఇదంతా ఉపోద్ఘాతమని అప్పుడర్థమైంది, మిగిలిన ఇద్దరికీ. ముఖాలనిండా ఒక్కసారి ఉత్కంఠ.

దానిని గుర్తు చేసుకోవడం, చెప్పవలసి రావడం పెద్ద చేదు అనుభవంలా అనిపిస్తున్నట్టుంది రాఘవులకి. రెండు గుటకలు మింగాడు. ఉద్వేగాన్ని ఆపుకోడానికి అన్నట్టు పెదాలు రెండూ మునిపళ్ళ మధ్య అదిమిపట్టాడు ఒక లిప్తపాటు.

''ఇంకో రెండు గంటల్లో తెల్లారుతుందనగా మోసుకొచ్చి ఇదిగో ఈ మంచం మీదే, ఇలాగే, ఇప్పటిదాకా ప్రసన్న గారు పడుకుని ఉన్నట్టే- పడుకోబెట్టాం, ఆ మనిషిని. నేను ఎండీనా! ఎమ్మెస్సా? ఓ చిన్న ఆరెంపీ వైద్యుణ్ణి. ఆమెను చూస్తుంటే నా కాళ్ళే చల్లబడిపోతున్నట్టనిపించాయి. మాటామంతీ లేవు. వెర్రిచూపు పడిపోయింది. జుట్టంతా విడిపోయింది. గుండెల మీద పెద్ద చిరుగుతో అడ్డదిడ్డంగా చీర.....''

''క్షణం క్రితం ఏం జరిగిందో అదంతా ఓ క్షణం మరచిపోయాం. అంత భయంకరమైన ఒక సమష్టి చేదు అనుభవం ఆమెకు పట్టిన దుస్థితి ముందు వెలవెలబోయింది. అప్పుడే దూరంగా ఏడుపు. ఎవరో ఆ పిల్లాణ్ణి వాళ్ళ గుడిసె లోపల నుంచి ఇక్కడకి తీసుకొచ్చారు. ఆ పెనుగులాటలో వాడికి ఏం తగిలిందో ఏమో, గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. ఆమె కొడుకే. అసలా గుక్కతోనే చచ్చిపోతాడేమోననిపించింది.''

''అంత పసి వయసులోనే వాడు పోలీసు జులుం ఎలా ఉంటుందో రుచి చూసేశాడు.''

''ఆవేళ రాత్రి ఒంటిగంట అవుతుంది. అప్పుడొచ్చాయి రెండు లారీలు, ఒక జీప్. యాభయ్ మంది దాకా ఉంటారు పోలీసులు. అందరి చేతిలోను మోడ్రన్ గన్స్. కొందరు ఈ పందొమ్మిది గుడిసెలను చుట్టుముట్టారు. ఇంకొందరు ప్రతి గుమ్మం తడుతూ హడావిడి చేశారు. లారీలతో ఒకటే హడావిడి. తలుపు తీస్తే లోపలికి చొరబడి వెతికారు. ముసలి ముతకా అని లేకుండా అందర్నీ ఈడ్చుకొచ్చి నిలబెట్టారు, అదే ఈ ఇంటి ముందు ఉన్న ఆ చిన్న గ్రౌండ్‌లో.'' చేత్తో సూచిస్తూ అన్నాడు రాఘవులు.''ఎవడో ఇంకో కొండవాడిని కూడా తెచ్చారు. ఇన్ఫార్మర్. వాడు ఎవరిని చూపిస్తే వాళ్ళని పక్కన నిలబెట్టారు. ఎందరికి మూడిందోనని తల్లడిల్లిపోయాం.''

''ఇంకో నలుగురుని దాటి ఉంటే నా ముఖం వాడు చూసేవాడు. అప్పుడే పిలిచాడా కానిస్టేబుల్.''

''ఇదింతా సరే, అప్పుడు సదరు ఇన్ఫార్మర్ ఆ కానిస్టేబుల్‌కి చెప్పిన మాటలు నేను ఇప్పటికీ మరచిపోను. ............''

''అరే పద్దిగా! ఈళ్ళేంట్రా? ఈళ్ళకీ బట్టలేంట్రా?'' అన్నాడు కానిస్టేబుల్.

ఆరు బ్యాటరీల టార్చి ఆన్‌చేసి గ్రౌండ్‌లో నిలబడ్డవాళ్ళ మీద వేసి విస్తుబోయి చూస్తున్నాడు .

అతి వినయంగా కదిలి వెళ్ళి దండకట్టుకుని చెప్పాడు పద్దిగాడు, ''ఇదేసార్ కరాయిగూడ తండా. ఈలందరిదీ బుద్దుడి మతం. అశోకుడని ఆడెవడో రాజు ఉండేవోడంట. ఒడ్డోళ్ళతో యుద్దం కూడా చేయిస్నాడంట. ఆ యుద్దం చూడ్నేక అక్కడే బుద్దిడికి బక్తుడైపోనాడంట. తిరిగి ఆడి దేసం ఎలిపోతా ఇక్కడా కొందరు కొండోళ్ళని బుద్దుడి బక్తులుగా మార్సినాడంట. తండా ముందు సూసినాం గాదా! రెండు గుల్లు. అయి ఈలవే. ఈలకి మాలాగ పూజలకి గొరవలి ఉండదు. గురువే ఉంతడు.''

''కొండోలు కూడా బౌద్దులే!'' కానిస్టేబుల్.

''ఈలంతా పొగలే అన్నం తింతరు. రాత్రి కాయలూ, పాలే. కొండోల్లేకానీ బాబూ, మాలాగ నీసు ముట్టరు. పిట్ట కూడా తిన్రు. కల్లూ ముట్టరు. తండా అంతా కలిపి అరవై ఇద్దరు.''

''గుడ్డలకి ఆ రంగేంటి? మగోలందరికీ గుండ్లేటి?''

''ఔన్సారు!. ఏదో చెట్టు బెరడు ఉడికించి, ఆ నీలలో గుడ్డలు ముంచుతారు , సాదువుల బట్టల్లాగంట. పొగలు చూస్తే నక్కరంగులో ఉంటాది బాబూ గుడ్డ.........''

''పద్దిగాడు అటుపోవడంతో నేను గిరిజనేతరుడినన్న సంగతి బయటపడలేదు. ఇక్కడ కొన్ని తండాలకి వైద్యం చేస్తున్నా నేను హక్కుల కార్యకర్తనన్న సంగతి పోలీసులలో కొందరికి చూచాయగా తెలుసు. నన్నే గనక ఆ రాత్రి వాళ్ళలో ఏ ఒక్కరు గుర్తించినా కాల్చిపారేద్దురు. ఇంకో నకిలీ ఎన్‌కౌంటర్ నమోదయ్యేది. అంతకసి వాళ్ళ మాటల నిండా.''

''నక్సల్స్‌కి అన్నం పెట్టారా?''

''వాళ్ళు ఎప్పుడువచ్చారు?''

''వాళ్ళనెక్కడ దాచారు?''

''ఇవే ప్రశ్నలు. అరికాళ్ళలో లాఠీలతో కొట్టి బూటుకాళ్ళతో తన్ని, తుపాకులు సర్దుకుంటూ ...... వాళ్లిష్టం. సార్ వాళ్ళకీ మాకు ఎలాంటి సంబంధం లేదు. మమ్మల్ని హింసించడం న్యాయం కాదు అన్నాను నేను నోరు తెరిచి. ఒక పోలీసువచ్చి చెంప



మీద లాగి కొట్టాడు. చుక్కలు కనిపించాయి నాకు. ఇంకో ముగ్గురు జతయ్యారు. నిజంగా కొన్ని నిమిషాలు బంతాడేశారు నన్ను. తరువాత లారీలు వెళ్ళిపోయాయి. పోలీసులు వెళ్ళిపోయారు. జీప్ మాత్రం కొంచెం దూరం వెళ్ళి ఆగింది. పై ప్రాణాలు పైనే పోయాయి మాకు. మళ్ళీ ఆ జీప్ వెనక్కి వస్తుందేమోనని బెరుకు. కొద్దిసేపటికి నలుగురు పోలీసులు తండాకి చివరిగా విసిరేసినట్టు ఉందే, ఆ గుడిసెలోనుంచి బయటకు వచ్చారు. పరుగెత్తుకు వెళ్ళి జీప్‌ను అందుకున్నారు. జీప్ కూడా వెళ్ళిపోయింది.ఎప్పటిలాగే చీకటీ మేమూ మిగిలాం.''

''మాకు లీలగా అర్థమైంది. మా ఇంటి యజమాని జోగయ్య, ఆయన భార్య నేను ఇంకో నలుగురు వెంటనే ఆ గుడిసె దగ్గరికి పరుగు తీశాం. అదే నిజం. లోపల ఈతాకు చాప మీద గుణమ్మ అపస్మారక స్థితిలో కనిపించింది. గుణమ్మ అంటే చివర విసిరేసినట్టుండే ఆ తాటాకు ఇంట్లో ఉంటుంది. సారన్న అని అతని కోడలు.''

''లాంతరు వెలుగులో ఆమె నగ్నదేహం కనిపించింది.ముందు ఇద్దరు ఆడవాళ్ళు లోపలికి వెళ్ళి దూరంగా విసిరేసి ఉన్న చీర ఒంటికి చుట్టబెట్టారు. అంతా కలసి ఎత్తుకుని ఈ గదిలోకి తీసుకొచ్చాం.''

''ఈ ఇంటి యజమాని భార్య, అంటే జోగన్న భార్య నీళ్ళు తెచ్చి చిలకరించింది. ఉలిక్కిపడి చుట్టూ చూసింది ఆ అభాగ్యురాలు. నేను పలకరించి చూశాను. 'గుణమ్మా! ఇలా చూడు! బయంనేదులే' అంది జోగన్న భార్య. ఒక్కసారి అందర్నీ బేలగా చూసి కళ్ళు మూసుకుంది నెమ్మదిగా. జోగన్న భార్యే గుణమ్మ నోరు తెరిచి కాసిన్ని నీళ్ళు పోసింది.అంతే. ఇంతింత కళ్ళు చేసేసి పూనకం వచ్చినట్టు ఎక్కడెక్కడికో చూడడం మొదలు పెట్టింది. ఒక్కసారిగా ఏడుపు మొదలుపెట్టి ఏదో చెప్పాలనుకుని చేతులు కదిలిస్తోంది. నాకు లీలగా అర్థమైంది. ఒంటి మీదకు స్పృహ వచ్చి మెదడు కాస్త పనిచేయడం ప్రారంభించిన తరువాత ఆమె చెవికి సోకింది ఆ ఏడుపే. అందర్నీ తప్పించుకుని వెళ్లి ఒక ముసలమ్మ చేతిలో ఉన్న ఆ పిల్లాణ్ణి తీసుకొచ్చి పక్కలో పడుకోబెట్టాను. ఒళ్ళు తడిమి వాడు ఉన్న వైపు ఒత్తిగిలడానికి ప్రతియత్నిస్తూ 'అమ్మా' అంది మూలిగినట్టు. మా ఇంటాయన పెళ్ళామే జబ్బ పట్టుకుని పిల్లవాడి వైపు తిరగడానికి సాయం చేస్తే కుర్రాణ్ణి గుండెలకి అదుముకుని పడుకుంది. తల్లి స్పర్శ తగలగానే వాడు శాంతించాడు. అప్పుడు నాకు కొంచెం ధైర్యం వచ్చింది. గబగబా నా మందుల బ్యాగ్ వెతికాను. ముందు టెట్నస్ ఇచ్చాను. అప్పటికే మొదలైనాయి, ఆడవాళ్ళ గుంపు నుంచి శోకాలు. అందరి ముఖాలలోను పెద్ద ప్రశ్న. గుణమ్మ సంగతేమిటి?''

''అది మాస్ రేప్. చేసింది పోలీసులు. ఆ వశు ప్రవృత్తిలో ఉండే బీభత్సం అంతా ఆమె ఒంటి మీద కనిపించింది. కాళ్ళు ఎడం చేయడం, నిరాకరణకి కసితో గుద్దడం ఇంకా ఎన్నో... రేపిస్టులు చూపించే కర్కశత్వం జాడలు ఆపాదమస్తకం కనిపించాయి. ఆ జుగుప్సని తలుచుకోడానికి కూడా ఏ ఆడది ఇష్టపడదు. అయినా తెల్లారితే ఆమె ముఖం మీద ఒక అదృశ్య ముద్ర తథ్యం. ఆలోచిస్తూనే ముందు గాయాలు కడిగించాను. చీర మార్చారు ఆడవాళ్ళు. బ్లీడింగ్ కనిపించింది. ఒళ్ళు, చీర మగ మదం వాసన కొడుతున్నా ఆడవాళ్ళు ఆ పని ఎంతో శ్రద్ధగా చేశారు. నా దగ్గరుండే బోరిక్ పౌడర్, బెంజిన్ ఇవే వేయించాను. అప్పుడు మెంటల్ ట్రామా తగ్గడానికి ట్రైకా ఇచ్చి బయటకొచ్చాను.''

''ఆ గ్రౌండ్‌లోనే పంచాయతీ నడుస్తోంది. జోగన్నకి ఓ అమ్మాయి చెబుతోంది.''

''పోలీసులు రావడానికి రెండు మూడు గంటల ముందే సారన్న అతడి పెళ్ళాం, ఇద్దరు కొడుకులు కలసి అడ్డాకులు పట్టుకుని దముకు షాందీకి, అంటే వారపు సంతకి వెళ్ళారట. అరకు లోయకు కాస్త అవతల ఉంది దముకు. మొగుడితో ఏదో చిన్న తగువు. ఇంటిలో చంటి బిడ్డను పెట్టుకుని గుణమ్మ ఉండిపోయింది ఒంటరిగా.అదే ఆమె చేసిన పాపం.''

నా నిర్ణయం ఒక్కటే. ఈ రాత్రి జరిగిన గోరం మన మన గుండెల్లోనే పాతరైపోవాలి. అడవి, అమ్మతల్లి సాక్షిగా ఆ ఊసు కాలి బూడిదైపోవాల. అన్నాడు మా ఇంటాయన. ఆశ్చర్యం అంతా ఎవరూ చెప్పకుండానే నేల మీద అరచేయి పెట్టి ఒట్టు పెట్టారు.

''ఆడవాళ్ళు, మగవాళ్ళు అంతా చుట్టూ నిలబడి వింటున్నారు. అందరి ముఖాలలోను బాధ. మనసులో బాధ. లాఠీ దెబ్బల బాధ. ఒకరిద్దరు ఆడవాళ్ళు ఒక్కసారి భోరుమన్నారు.''

''ఈ సంగతి తెలిస్తే గుణమ్మను మొగుడు మరి ఏలుకోడు. కాపరం నిలబడదు. పుట్టిల్లు, అత్తిల్లు రెండూ ఉండవు.''

''అసలు కాస్త తెలివొస్తే గుణమ్మే ఏదో మింగి చచ్చినా చావొచ్చు! రేపట్నించి తండాలో ప్రతి మనిషి ఏదో ముద్ర దాని ముఖం మీద ఉన్నట్టు పరికించి చూస్తూనే ఉంటారు. అందరి మనసులోను ఇదే మథనం.''

''మా ఇంటాయనే తండా పెద్ద. కొద్దిసేపు ఆలోచించి చెప్పాడు. సాష్టాంగ పడాలనిపించింది, ఆ తీర్పు విని......''

''తప్పు దాన్దికాదు. కాబట్టి శిక్ష మాత్రం ఎందుకు పడాల? అది ఒల్లు దూలెక్కి ఆ లంజకొడుకుల దగ్గరికి పోలేదు. నా మనస్సాక్షి ఒక్కటే చెబుతోంది. గుణమ్మని మనమే కాసుకోవాలి. దాని మానం మన కళ్ళ ముందు పోయింది. ఆ పాపం ఇప్పటికే మనం మూట గట్టుకున్నాం. అది చస్తే ఆ పాపమూ మన్దే. పడితే శిక్ష మనకే పడాలి. నా నిర్ణయం ఒక్కటే. ఈ రాత్రి జరిగిన గోరం మన మన గుండెల్లోనే పాతరైపోవాలి. అడవి, అమ్మతల్లి సాక్షిగా ఆ ఊసు కాలి బూడిదైపోవాల. అన్నాడు మా ఇంటాయన. ఆశ్చర్యం అంతా ఎవరూ చెప్పకుండానే నేల మీద అరచేయి పెట్టి ఒట్టు పెట్టారు.''

''మరునాడు సాయంత్రం సారన్న కుటుంబం వచ్చింది. సంతంటే వీళ్ళకి రెండురోజుల యాత్ర. అదే వరమైంది మాకు. ఆ రెండు రోజులలోనే గుణమ్మను కాస్త మామూలు మనిషిని చేయగలిగాం. ఊరంతా ఒక్కటై చెప్పింది. ఇంటి గొడవలు పడలేక గుణమ్మ ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఆ ప్రయత్నంలో గాయాలయ్యాయి. పోలీసులు రావడానికి ముందే అది జరిగింది.''

''కొద్దికాలానికి శరీరం మీద గాయాలు తగ్గాయి. తరువాత మనసు మీద గాయమూ పాతబడింది. ఇప్పుడు కాపరం చేసుకుంటోంది. నలుగురిలోను తిరుగుతోంది. చూస్తుండగానే ఏడాది గడిచిపోయింది.''

గాలి మరింత చల్లబడింది. వాళ్ళకి తెలియకుండానే చలికి చేతులు కట్టుకున్నారు.

హఠాత్తుగా ఎండుటాకుల మీద ఏవో ఒకదానిని ఒకటి తరుముకుంటూ, అరుచుకుంటూ పరుగెత్తిన శబ్దం బయట. ఉలిక్కిపడ్డారు మస్తాన్‌రెడ్డి, ప్రసన్న.

గట్టిగా ఆవలించిన మస్తాన్‌రెడ్డి అక్కడే ఉన్న ఖాళీ టీ గ్లాసుని పక్కకి తీసి మట్టి నేలమీదే నడుం వాల్చే ప్రయత్నం చేస్తున్నాడప్పుడే.

అప్పుడే ఒక్కసారిగా లేచి సంచి సర్దుకుంటూ అన్నాడు ప్రసన్న, ''బయల్దేరదాం''.

తెల్లవారుజాము నాలుగున్నర ప్రాంతం కావచ్చు.

''బయల్దేరుదురుగాని లెండి, కొంచెం సేపుంటే వెలుగు వచ్చేస్తుంది. నేనే దిగబెడతా! ఇంతలో టీ కూడా కాగుతుంది'' అంటూ పొయ్యిలో బూడిద పక్కకి తోసేసి సగం కాలి ఉన్న చితుకులనే మళ్ళీ పెట్టి వెలిగించాడు రాఘవులు. పొగగొట్టంతో ఊదుతున్నాడు. పీచులేనట్టుంది. మంట రావడం లేదు. బుగ్గలు పూరించి పూరించి కష్టపడి ఊదుతున్నాడు రాఘవులు.

''ఇవి పెట్టి ఊదండి, త్వరగా వెలుగుతుంది.'' అన్నాడు ప్రసన్న, ఆ స్క్రిబ్లింగ్ ప్యాడ్‌లో రాసిన రెండు కాగితాలని సర్రున చింపి ఇస్తూ.

రాఘవులు, మస్తాన్‌రెడ్డి ఆశ్చర్యంగా చూశారు ప్రసన్నకేసి.

అదేం పట్టించుకోలేదు ప్రసన్న. అతని వేళ్ళమధ్య చిరుగుతూనే ఉన్నాయి పేజీ తరువాత పేజీ...

★